సాక్షి
ఖమ్మం
ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



అర్హులకే పథకాలు ఇవ్వాలి

ప్రభుత్వ పథకాలను అర్హులకు మంజూరు చేయాలని రఘునాథపాలెంలో అఖిలపక్షం ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. 8లో



ముగిసిన నామినేషన్ల పర్వం

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగుతాయో, లేదో స్పష్టత రాకున్నా నామినేషన్ల స్వీకరణ మాత్రం ముగిసింది. 10లో

గరిష్టం / కనిష్టం
35° / 22°

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత ఎండ పెరిగి సాయంత్రానికి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూల విరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశాక, స్వామి, అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్య కల్యాణం జరిపించారు. ఆతర్వాత పల్లకీసేవ నిర్వహించగా తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కె.జగన్మోహన్ రావు, ఉప ప్రధాన అర్చకులు ఉప్పల విజయ దేవశర్మ, ముఖ్య అర్చకులు మురళీమోహన్ శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శిగా నర్సింహమూర్తి

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శిగా నర్సింహమూర్తి నియమితులయ్యారు. కూసుమంచి జిల్లా పరిషత్ హైస్కూల్ పీడీగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను ఏడాది కాలానికి క్రీడా కార్యదర్శిగా నియమిస్తూ డీఈఓ సోమశేఖరశర్మ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆయన జోన్, జిల్లా స్థాయి పోటీలతో పాటు వివిధ రాష్ట్ర స్థాయి పోటీలకు జట్ల ఎంపిక బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. గతంలో కార్యదర్శిగా నర్సింహారెడ్డిని నియమించగా ఆయన హెచ్ఎంగా పదోన్నతిపై బదిలీ కావడంతో నర్సింహమూర్తిని నియమించారు.

ఈనెల 10నుంచి సదరమ్ క్యాంపులు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఈనెల 10 తేదీ నుంచి సదరమ్ క్యాంపులు నిర్వహించనుండగా షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 10న మధిర, 17న సత్తుపల్లి, 31న పాలేరు నియోజకవర్గ దివ్యాంగుల కోసం క్యాంపులు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, నవంబర్ 7న వైరా, 14న ఖమ్మం నియోజకవర్గాల వారికి క్యాంపులు ఉంటాయని పేర్కొన్నారు. ఇక 21న ముదిగొండ, సింగరేణి, కామేపల్లి, 28న మధిర మున్సిపాలిటీ, మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని మండలాల దివ్యాంగుల కోసం క్యాంపులు ఏర్పాటుచేస్తామని తెలిపారు. అలాగే, డిసెంబర్ 5న సత్తుపల్లి, 12న పాలేరు, 19న వైరా, 27న ఖమ్మం నియోజకవర్గ దివ్యాంగుల కోసం శిబిరాలు ఉంటాయని, క్యాంపునకు హాజరయ్యే వారు స్లాట్ బుక్ చేసుకున్న రశీదు, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, మెడికల్ రిపోర్టు తీసుకు రావాలని సూచించారు.

ప్యాసింజర్ రైళ్ల రద్దు పొడిగింపు

ఖమ్మం మామిళ్లగూడెం: ట్రాక్ మరమ్మతుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసింది. అయితే, ఈనెల 9వ తేదీ వరకు రద్దు నిర్ణయం అమల్లో ఉంటుందని వెల్లడించగా, పనులు పూర్తికాకపోవడంతో 15వ తేదీ వరకు పొడిగించినట్లు సీసీఐ జాఫర్ తెలిపారు. ఈమేరకు విజయవాడ నుండి ఖమ్మం మీదుగా నడిచే డోర్నకల్ – విజయవాడ(07755), విజయవాడ – డోర్నకల్ (07756), భద్రాచలం రోడ్ – విజయవాడ(07278), విజయవాడ– భద్రాచలం రోడ్ (07279) ప్యాసింజర్ రైళ్లు 15వ తేదీ వరకు నడవవని వెల్లడించారు.

మూడు రోజులు 'కృష్ణా' రద్దు

కృష్ణా జిల్లా బాపట్ల వద్ద ట్రాక్ పనులు జరుగుతున్న నేపథ్యాన ఆదిలాబాద్ – తిరుపతి మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్(17406)ను ఈనెల 8, 9, 10వ తేదీల్లో రద్దు చేశారు. అలాగే, తిరుపతి – ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్(17405)ను ఈనెల 7, 8 9వ తేదీల్లో రద్దు చేసినట్లు సీసీఐ జాఫర్ తెలిపారు.

డయల్ 100కు 3,619 ఫోన్లు

ఖమ్మంక్రైం: ఆపదలో ఉన్న వారిని తక్షణమే ఆదుకునేందుకు ఏర్పాటుచేసిన డయల్ 100కు సెప్టెంబర్‌లో 3,619 మంది ఫోన్ చేశారని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 70 ఫోన్లకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని పేర్కొన్నారు. కాగా, అత్యవసర సమయంలోనే డయల్ 100కు ఫోన్ చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

జోగ్గూడెంలో సాగు చేసిన వంగ తోట



ఊరంతా కూరగాయల సంత!

- ఆకుకూరలు, కూరగాయల సాగుకు కేరాఫ్‌గా జోగ్గూడెం
- ఏడాది పొడవునా సాగు చేస్తున్న గిరిజనం
- తక్కువ పెట్టుబడితో నికర ఆదాయం గడిస్తున్న రైతులు
- ఒకరిని చూసి ఇంకొకరుగా విస్తరిస్తున్న సాగు



గిరిజనుల సాగు చేసిన ఆకుకూరలు

సండే స్పెషల్

కామేపల్లి: తక్కువ సమయం.. తక్కువ పెట్టుబడి.. ఓ పంటలో నష్టమొచ్చినా.. ఇంకో పంటలో లాభం వచ్చే అవకాశం.. ఇంకేముంది గిరిజన రైతులు వాణిజ్య పంటలు సాగుచేస్తున్నా తప్పనిసరిగా ఎంతో కొంత భూమిలో ఆకుకూరలు, కాయగూరల సాగు చేయడాన్ని అలవాటుగా మార్చుకున్నారు. కామేపల్లి మండలంలోని గిరిజన గ్రామమైన జోగ్గూడెం వాసులు ఒకే రకమైన పంటలు వేసి నష్టపోవద్దనే భావనతో కూరగాయల సాగుపై దృష్టి సారించారు. ఏళ్లుగా సాగు చేస్తున్న వారికి నికర లాభం అందుతుండడంతో ఒకరిని చూసి ఇంకొకరు అన్నట్లుగా గ్రామవాసులంతా కూరగాయల సాగులో నిమగ్నవడం విశేషం.

డ్రిప్ విధానంతో సాగు..

జోగ్గూడెం గ్రామంలో పెద్దగా జలవనరులు లేవు. బోరు బావులపైనే ఆధారపడి సాగు చేయాల్సిందే. ఏడాది పొడవునా కూరగాయలు, ఆకుకూరల పంటలు సాగు చేస్తున్న రైతులు డ్రిప్ విధానంలోనైనా తక్కువ నీరు సరిపోతుందని, కలుపు ఎక్కువగా రాదని.. కూలీల ఖర్చు తగ్గుతుందని గుర్తించారు. ఇలా ప్రతీఒక్కరు డ్రిప్, మల్చింగ్ ఏర్పాటు చేసుకుని 45 రోజుల నుంచి 90 రోజుల్లో చేతికొచ్చే టమాటా, వంకాయ, సొరకాయతో పాటు మిర్చి, బీర, కాకర, చిక్కుడుకాయలే కాక పాలకూర, బచ్చలికూర, తోటకూర, చుక్కకూర, కొత్తిమీర, పుదీనా వంటి ఆకుకూరలు సాగు చేస్తున్నారు. తద్వారా ఒక పంటలో నష్టం వచ్చినా ఇంకో పంటతో ఆదాయం సమకూరుతుండగా నష్టం ఎదురుకావడం లేదు. అలాగే, ఆకుకూరలు, కూరగాయలకు ఏడాది పొడవునా మార్కెట్‌లో డిమాండ్ ఉండడం... కొన్ని సందర్భాల్లో వ్యాపారులే తోటల వద్దకు వస్తుండడంతో దళారుల బెడద కూడా లేదని చెబుతున్నారు.

నేరుగా సంతలోనే విక్రయాలు..

రైతులు ఆరుగాలం కష్టించి పండించిన కూరగాయలను దళారులకు కాకుండా నేరుగా వారాంతపు సంతల్లో విక్రయిస్తారు. మండలంలోని పండితాపురంలో ప్రతీ బుధవారం జరిగే సంత వీరికి కలిసొస్తోంది. అలాగే, కారేపల్లి సంత, ఇల్లెందు మార్కెట్లో కూడా విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. ఇక సీజన్‌లో వ్యాపారులే నేరుగా గ్రామానికి ఆకుకూరలు, కూరగాయలను కొనుగోలు చేస్తుండడంతో రవాణా ఖర్చులు కూడా మిగులుతున్నాయి. తక్కువ పెట్టుబడితో కొద్ది సమయంలోనే పంట చేతికొచ్చి ఆదాయం సమకూరుతుండడంతో ఇతర పంటల సాగు పెట్టుబడి, ఇంటి ఖర్చుల కోసం రైతులు ఆలోచించాల్సిన అవసరం పడడం లేదు.

ఎన్నడూ నష్టం రాలేదు..

ఆకుకూరల సాగు చేయడం వల్ల ఎన్నడూ మాకు నష్టం రాలేదు. అందుకే ప్రతీ సంవత్సరం ఆకు, కూరగాయలు సాగు చేస్తాం. మేము దళారులను ఆశ్రయించకుండా నేరుగా మార్కెట్లు, సంతల్లో విక్రయిస్తాం. తాజాగా లభిస్తుండడంతో ప్రజలు కూడా మా దగ్గర కొనేందుకు ఆసక్తి చూపిస్తారు.



ఆకుకూరల విక్రయానికి వెళ్తున్న అజ్మీరా లాలు

ముగ్గురు పిల్లలను చదివిస్తున్నా..



రెండు ఎకరాల భూమిలో ఎకరన్నరలో మిరప, వరి పోగా మిగిలిన భూమిలోఆకుకూరలు, కూరగాయల సాగు చేస్తున్నా. వీటిని అమ్మితే వచ్చే ఆదాయం మిరప, వరి పంట పెట్టుబడికి సరిపోతోంది. బయట అప్పులు చేయాల్సిన అవసరం రాకపోగా, ముగ్గురు పిల్లలను మంచిగా చదివిస్తున్నా.

– జర్పుల వీరన్న, జోగ్గూడెం

రెండు కుంటల భూమిలో...



రెండు కుంటల భూమి కౌలుకు తీసుకుని ఇంకో రైతు వద్ద నీరు కొనుగోలు చేస్తున్నాం. ఈ భూమిలో అన్ని రకాల ఆకుకూరలు సాగుచేశాం. ఆకుకూరలను నా భర్త ఇల్లెందు తీసుకెళ్లి విక్రయిస్తాడు. మేము కూలీ పనులకు వెళ్లకుండా కూరగాయల సాగుతో వచ్చే ఆదాయంతోనే జీవిస్తున్నాం.

– జర్పుల సాలీ, జోగ్గూడెం

సంప్రదాయంగా సాగు చేస్తున్నారు



మా ఊరిలోని ప్రతీ రైతు మిరప, పత్తి, వరి కంటే ఆకు, కూరగాయల సాగుపైనే ఆసక్తి చూపిస్తారు. కూరగాయల అమ్మకంపై వచ్చే ఆదాయాన్ని ఇతర పంటల పెట్టుబడికి ఉపయోగిస్తారు. ఏడాది పొడవునా సంప్రదాయంగా ఆకు, కూరగాయల సాగు చేస్తున్న మా గ్రామస్తులు ఆదర్శంగా నిలుస్తున్నారు.

– జర్పుల రామోజీనాయక్, మాజీ సర్పంచ్

ఇండోర్ స్టేడియం ప్రారంభం

మధిర: మధిర డిగ్రీ కళాశాల సమీపాన రూ.2.50 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని శనివారం ప్రారంభించారు. కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు తదితరులు స్టేడియం ప్రారంభించి మాట్లాడారు. ఇండోర్ స్టేడియం క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుందని, నిత్యం సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని సూచించారు. అనంతరం వారు షటిల్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత, ఎంపీపీ లలిత, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ సిలార్ సాహెబ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చెప్పకుండానే..

గ్రీన్ ఫీల్డ్ మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు పూర్తికాకుండానే ప్రారంభించడం విమర్శలకు తావిస్తోంది. అలాగే, ప్రారంభోత్సవానికి కలెక్టర్ వస్తున్న విషయమై స్థానిక అధికారులు మీడియాకు కూడా సమాచారం ఇవ్వలేదు. కాగా, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కకు ప్రారంభోత్సవంపై ఇటీవల అధికారులు చెప్పగా, స్టేడియం నిర్మాణం పూర్తయిందా అని ఆరా తీసినట్లు తెలిసింది. దీంతో కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పగా, పూర్తి కాకుండా ప్రారంభోత్సవం ఎలా చేస్తారంటూ భట్టి ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో అటు ఎమ్మెల్యేకు, ఇటు మీడియాకు సమాచారం ఇవ్వకుండా స్టేడియాన్ని ప్రారంభించడంపై చర్చ జరుగుతోంది.



స్టేడియంను ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ, జెడ్పీ చైర్మన్ తదితరులు

అల్లాడుతున్న రైతాంగం

- పంటల సంరక్షణకు 15 టీఎంసీల నీరు అవసరం
- నాగార్జునసాగర్ నుంచి 2వేల క్యూసెక్కులు విడుదల
- రెండు రోజుల్లో పాలేరు రిజర్వాయర్‌కు చేరే అవకాశం
- అయినా పంటలకు విడుదలపై ఇప్పటివరకు అస్పష్టతే..



కల్లూరు మండలం యజ్ఞనారాయణపురంలో అడుగంటిన చెరువు నుంచి మోటార్ ద్వారా తోడుతున్న రైతు

ఖమ్మంఅర్బన్: జిల్లాలో ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు నీరందక నిలువునా ఎండిపోతున్నాయి. వరి పంట పొట్టదశలో ఉండడం.. మిరప, పత్తి, మొక్కజొన్నకు సైతం నీటి తడులు అవసరం కావడంతో పంటలను రక్షించుకునేందుకు రైతులు అల్లాడిపోతున్నారు. నాగార్జునసాగర్ జలాలు వస్తే తప్ప పంటలు బతికే అవకాశం లేక ఏం చేయాలో తోచక దిక్కుతోచని స్థితి ఎదుర్కొంటున్నారు. జిల్లాలో సాగర్ ఆయకట్టు పరిధి 17 మండలాల్లోని రైతులు 1.85లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేసినట్లు అధికారిక అంచనా. ఈ పంటలన్నీ చేతికందే దశలో ఉండగా వరుణుడు ముఖం చాటేశాడు. మరోపక్క కృష్ణా పరీవాహకంలోనూ వర్షాలు లేక సాగర్ వట్టిపోయి నీరు విడుదల చేయలేదు. అయితే, తాజాగా సాగర్ నుంచి నీరు విడుదల చేయాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాలతో అధికారులు శనివారం మధ్యాహ్నం వెయ్యి క్యూసెక్కులు విడుదల చేసి సాయంత్రానికి రెండు వేల క్యూసెక్కులకు పెంచారు. ఈ నీరు పాలేరు రిజర్వాయర్‌కు చేరడానికి రెండు రోజులు పడుతుందని సమాచారం. అయితే, రిజర్వాయర్‌కు చేరాక నీటిని పంటలకు విడుదల చేయాలా, వద్దా అనే అంశంపై ఇప్పటివరకు ఆదేశాలేమీ రాలేదని తెలిసింది.

మూడు తడులు.. 15టీఎంసీలు

సాగర్ ఆయకట్టు పరిధిలో సాగు చేసిన పంటలను కాపాడాలంటే మూడు తడులు అవసరం ఉంటుందని, ఇందుకోసం కనీసం 15 టీఎంసీల నీరు విడుదల చేయాలని ఇటీవల జరిగిన ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో అధికారులు చెప్పినట్లు తెలిసింది. దీంతో జిల్లా ప్రజాప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు సీఎం సూచనలతో శనివారం సాగర్ నుంచి నీరు విడుదల చేశారు. మరోపక్క నీటి కోసం జిల్లా ప్రజాప్రతినిధులు, రైతుల నుంచి జలవనరులశాఖ అధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. అదునులో నీరు విడుదల చేయకుండా తర్వాత విడుదల చేసినా ఫలితం ఉండదని వారు చెబుతున్నారు. కాగా, శనివారం రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినా సూర్యాపేట వరకు కూడా సక్రమంగా వచ్చే అవకాశం లేదని, ఆపై పాలేరుకు వచ్చినా ఉన్నత స్థాయి నుండి అనుమతి లభిస్తే తప్ప పంటలకు విడుదల చేయలేమని అధికారులు చెబుతున్నారు. కాగా, పాలేరులో పూర్తి స్థాయి నీటిమట్టం 23 అడుగులకుగాను ప్రస్తుతం 21 అడుగుల మేర నీరు ఉంది. అయితే సాగర్ నుంచి నీరు పాలేరులోకి చేరుతుంటే.. అందుకు అనుగుణంగా ఆయకట్టుకు విడుదల చేసే అవకాశముంటుంది.

గోదావరి జలాలపై దృష్టి

సాగర్‌లో నీటి నిల్వలు లేక గోదావరి జలాలను తరలించి ఆయకట్టులోని పంటలను రక్షించడానికి ఉన్న సాధ్యాసాధ్యాలపై ఉన్నత స్థాయి అధికారులు జిల్లా ఇంజనీర్లకు సూచనలు చేసినట్లు తెలిసింది. కాళేశ్వరం జలాలను బయ్యన్నవాగు ద్వారా శ్రీరాంసాగర్ నుంచి పాలేరు వరకు తీసుకురావడంపై దృష్టి సారించాలని చెప్పినట్లు సమాచారం. బయ్యన్న వాగు బ్యాలెన్స్ రిజర్వాయర్ ద్వారా మధ్యలో ఉన్న 25కి పైగా చెక్‌డ్యాంలను నింపుతూ నీటిని పారించాలనే ఆలోచన చేశారు. చెక్‌డ్యాంల్లో పుష్కలంగా నీరు ఉండడం.. గోదావరి జలాలు వస్తే శ్రీరాంసాగర్ ద్వారా పాలేరు చెరువులకు అందించవచ్చని భావిస్తుండగా.. ఆ నీరు ఈనెల 20 నాటికి చేరే అవకాశముంటుందని భావిస్తున్నారు. అటు సాగర్ లేదంటే గోదావరి జలాలను తీసుకొచ్చి జిల్లా ఆయకట్టులో పంటలను రక్షించాలని అధికారులు భావిస్తుండగా.. అందులో ఏ ప్రయత్నం ఫలిస్తుందో తెలియాలంటే వేచిచూడాల్సిందే.

అన్నదాతల అష్టకష్టాలు

ఎంత కష్టమైనా పంటలను రక్షించుకోవాలనే తపనతో రైతులు నిద్రాహారాలు మాని శ్రమిస్తున్నారు. ఈమేరకు చెరువులు, కాల్వల కింద సాగు చేసిన పంటలను కాపాడేందుకు మోటార్ల ద్వారా కుస్తీ పడుతున్నారు. చెరువుల్లో తూములకు ఎక్కని నీటిని మోటార్లు, ఆయిల్ ఇంజన్లు ద్వారా పొలాల్లోకి మళ్లిస్తున్నారు. ఇలా అవకాశం ఉన్న ప్రతీచోట పంటలకు నీరు అందిస్తుండడం కనిపిస్తోంది.

జేసీ మాల్‌ను ప్రారంభిస్తున్న రీతూవర్మ, షోరూం నిర్వాహకులు (ఇన్‌సెట్) ఆభరణాలు ప్రదర్శిస్తూ...





జేసీ మాల్ ప్రారంభం

సందడి చేసిన సినీనటి రీతూవర్మ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపాన నూతనంగా ఏర్పాటుచేసిన జేసీ మాల్‌ను సినీనటి రీతూవర్మ శనివారం ప్రారంభించారు. అన్ని వయస్సుల వారికి కావాల్సిన నూతన డిజైన్లతో రూపొందించిన వస్త్రాల విభాగంతో పాటు సిల్వర్ జ్యూయెలరీ షోరూంలను ఆమె ప్రారంభించగా... రీతూవర్మ వస్తుందనే సమాచారంతో జనం భారీగా చేరుకున్నారు. ఈమేరకు మాల్‌లోని వివిధ విభాగాలను ప్రారంభించిన రీతూవర్మ మాట్లాడుతూ కుటుంబంలోని అన్ని వయస్సుల వారికి కావాల్సిన వస్త్రాలు, వెండి ఆభరణాలను జేసీ మాల్‌లో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సినిమా పాటకు ఆమె స్టెప్పులు వేస్తూ సందడి చేశారు. జేసీ మాల్ నిర్వాహకులు కృష్ణారావు, వెంకటరెడ్డి, మర్రి జమునారెడ్డి, మర్రి మధుమతిరెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడారంగంలో ఖమ్మం ఆదర్శం

- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపన

ఖమ్మం స్పోర్ట్స్: క్రీడాకారులకు కావాల్సిన అన్ని వసతులను జిల్లా కేంద్రంలో అందుబాటులోకి తీసుకొస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. తద్వారా క్రీడారంగంలో రాష్ట్రంలోనే ఖమ్మం ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రూ.6కోట్ల వ్యయంతో నిర్మించే సింథటిక్ ట్రాక్ పనులకు శనివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇప్పటికే ఉన్న సౌకర్యాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని రాణిస్తున్నారని తెలిపారు. అయినా ఎక్కడా లేనట్లు సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ ఖమ్మంలో అన్ని క్రీడాంశాల్లో శిక్షణకు కావాల్సిన సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. అలాగే, వైరా, కల్లూరు, సత్తుపల్లి, మధిరలో మినీ స్టేడియంలను అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. ఈకార్యక్రమంలో డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడగా మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్ కుమార్, డీఈఓ సోమశేఖరశర్మ, క్రీడాసంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, ఎం.డీ.గౌస్, ఎం.డీ.మతిన్, అక్బర్‌అలీ, సున్నా రాధాకృష్ణ, మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీ అహ్మద్, క్రిస్టోఫర్ బాబు, ఎం.సుధాకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన కలెక్టర్ గౌతమ్ తదితరులు

'దళితబంధు'ను సద్వినియోగం చేసుకోండి

బోనకల్: దళితబంధు పథకం ద్వారా అందే యూనిట్లను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. బోనకల్ మండలం కలకోటలో జరుగుతున్న సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. పలువురి ఇళ్లకు ధ్రువపత్రాలు పరిశీలించడమే కాక కుటుంబ స్థితిగతులపై ఆరా తీసి మాట్లాడారు. యూనిట్ ఎంపిక సమయాన జాగ్రత్త వహిస్తే ఇబ్బంది ఉండదని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డీడబ్ల్యూఓ సుమ, తహసీల్దార్ పున్నంచందర్, ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం పథకం పరిశీలన

ఖమ్మంరూరల్: ముఖ్యమంత్రి అల్పాహార పథకంలో భాగంగా రెండో రోజైన శనివారం మండలంలోని జలగంనగర్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. చట్నీ, సాంబార్‌తో వెజిటబుల్ పులావ్ వడ్డించగా విద్యార్థులతో కలిసి ఆయన టిఫిన్ చేశారు. డీఈఓ సోమశేఖరశర్మ, ఎంఈఓ శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.



బోనకల్ మండలం కలకోటలో పథకంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ గౌతమ్

నర్సింగ్ కళాశాలలో ప్రవేశాలు షురూ..

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గానికి ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన నర్సింగ్ కళాశాలలో శనివారం ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని పెద్దతండా పరిధి గిస్కానాయక్ నగర్‌లోని అద్దెభవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కళాశాలలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ఎం.రత్నకుమారి తెలిపారు. ఈ విద్యాసంవత్సరం కళాశాలకు 60 సీట్లు కేటాయించగా, కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ద్వారా మొదటి విడత కౌన్సెలింగ్‌లో 37మంది విద్యార్థినులు ఆప్షన్‌గా ఎంచుకున్నారు. ఇందులో ఖమ్మంకు చెందిన కె.నిఖిత సహా ఐదుగురు విద్యార్థినులు శనివారం ప్రవేశం పొందగా, 10వ తేదీ వరకు ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శనివారం స్వామివారికి సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

క్లుప్తంగా

జాతీయస్థాయికి ఎంపికైన అథ్లెట్లకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్ఓ, డీఈఓ తదితరులు

ఖమ్మంస్పోర్ట్స్: కరీంనగర్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన అథ్లెట్లు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వివిధ విభాగాల్లో ఎ.మనుశ్రీ, బి.కృష్ణవేణి, ఎ.మైథిలి, బి.ఇందుప్రియ, పి.గోపీచంద్, కె.మస్తాన్, ఎస్.గోపీచంద్, డి.వివేక్‌చంద్ర, ఎస్కే లాల్‌పాషా, ఎస్కే మజీద్ పాషా, డి.దినేశ్‌కార్తీక్ ఈ నెల 15 నుంచి హనుమకొండలో జరిగే సౌత్‌జోన్ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నారు. వారిని శనివారం డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి, డీఈఓ సోమశేఖరశర్మ, అథ్లెటిక్స్ కోచ్ ఎండీ గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ నున్నా రాధాకృష్ణ, అధ్యక్షుడు మందుల వెంకటేశ్వర్లుతో పాటు ఎండీ షఫీక్ అహ్మద్, కృష్ణయ్య, సుధాకర్ తదితరులు అభినందించారు.

కొనసాగుతున్న న్యాయవాదుల క్రికెట్ టోర్నీ



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంలీగల్: జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సాహస్ చౌదరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన న్యాయవాదుల క్రికెట్ టోర్నీ శనివారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా జరిగిన మ్యాచ్‌ల్లో సూర్యాపేట జట్టుపై మంచిర్యాల జట్టు, ఆదిలాబాద్ జట్టుపై కోదాడ, కూకట్‌పల్లి జట్టుపై హైదరాబాద్, భూపాలపల్లి జట్టుపై ఖమ్మం వారియర్స్, కోదాడ జట్టుపై మంచిర్యాల జట్టు, నల్లగొండ జట్టుపై రంగారెడ్డి జట్టు విజయం సాధించి సెమీఫైనల్స్‌కు చేరాయి. టోర్నీ నిర్వాహకుడు దిలీప్‌చౌదరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావుతో పాటు లక్ష్మీనారాయణ, రావుల వెంకట్, గరిక సంపత్, ఎం.జే.ప్రవీణ్, ఎక్కిరాల రాంబాబు, నేరెళ్ల శ్రీనివాసరావు, గురు కృష్ణ, సింగం జనార్దన్ పాల్గొన్నారు.

వేధింపులు ఎదురైతే ఫిర్యాదు చేయండి



అవగాహన కార్యక్రమంలో విద్యార్థినులతో సీఐ అంజలి

ఖమ్మంక్రైం: మహిళలు, బాలికలు, విద్యార్థినులకు పనిప్రదేశాలు, విద్యాలయాల్లో వేధింపులు ఎదురైతే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని.. తద్వారా ఆపదలో ఉన్న వారికి షీ టీమ్స్ అండగా నిలుస్తాయని సీఐ అంజలి తెలిపారు. షీ టీమ్ బృందాలు జిల్లా కేంద్రంలోని విద్యాసంస్థల్లో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వేధింపులకు గురవుతున్న వారు మౌనం వీడి నిర్భయంగా బయటకు రావాలన్నారు. షీ టీమ్ కంప్లైంట్ క్యూ ఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో ఎక్కడి నుంచి అయినా ఫిర్యాదు చేసే అవకాశముందని తెలిపారు. అలాగే, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కానీ షీ టీమ్ వాట్సాప్ నంబర్ 87126 59222 నంబర్‌కైనా ఫోన్ చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో షీటీమ్ బృందం సభ్యులు, అధ్యాపకురాలు కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

మణుగూరుటౌన్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బీటీపీఎస్‌కు సింగరేణి నుంచి బొగ్గు తరలించేందుకు ఏర్పాటు చేస్తున్న రైల్వే ట్రాక్ పనులను చెరువు ముందు సింగారం గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. రైల్వే ట్రాక్ నిర్మాణం వల్ల తమ 22 కుటుంబాలకు రహదారి సౌకర్యం లేకుండా పోతోందని, తమకు కూడా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కల్పించాలని గతంలో నుంచి కోరుతున్నామని, అయినా ఆ అంశంపై నిర్ణయం తీసుకోవడంలో తాత్సారం జరుగుతోందని వాపోతున్నారు. ఈ విషయాన్ని రైల్వే కాంట్రాక్టర్ నుంచి సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు అక్కడకు చేరుకొని గ్రామస్తులకు నచ్చజెప్పి, తాత్కాలిక రహదారిగా మరో ప్రత్యామ్నాయం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ అజెండా

- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపన



టీఎన్జీవోస్ భవన్‌లో మాట్లాడుతున్న మంత్రి, పక్కన యూనియన్ బాధ్యులు

రఘునాథపాలెం : అన్నివర్గాల ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ అజెండా అని.. ఇదే లక్ష్యంతో ఆయన నిరంతరం తపిస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. రఘునాథపాలెం మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.1.95 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఆ తర్వాత పాపటపల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక మారుమూల గ్రామాల్లోనూ డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మించామని తెలిపారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని చెప్పారు. ఎంపీపీ భూక్యా గౌరి, జెడ్పీటీసీ ప్రియాంకతో పాటు గుత్తా రవి, పిన్ని సరిత కోటేశ్వరరావు, చెన్నబోయిన ముత్తమ్మ, సైదులు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

డివిజన్లలో శంకుస్థాపన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ మేరకు 44, 45, 49వ డివిజన్లలో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశాక మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే నగరాన్ని ఇంత అభివృద్ధి చేశామని చెప్పారు. మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ భవన్ ప్రారంభం

ఖమ్మంసహకారనగర్: జిల్లా కేంద్రంలోని పాత డీపీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టీఎన్జీవోస్ భవన్ (టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా కార్యాలయం)ను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఖమ్మం అభివృద్ధిని చూసి ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. కాగా, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మేయర్ పి.నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, టీఎన్జీవోస్ బాధ్యులు నందగిరి శ్రీను, జీఎస్ ప్రసాద్‌రావు, ఆర్‌వీఎస్ సాగర్, శాబాసు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లి ఆలయ అభివృద్ధికి రూ.15 లక్షలు

ప్రకటించిన ఎంపీ రవిచంద్ర



ఖమ్మంఅర్బన్: ఎంపీ రవిచంద్రను సన్మానిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌లోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ ముద్దిరావమ్మ అమ్మవార్ల ఆలయ అభివృద్ధి పనుల కోసం ఎంపీ కోటా నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు చేస్తానని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. ఆలయాన్ని శనివారం సందర్శించిన ఆయన ప్రత్యేక పూజల అనంతరం మాట్లాడారు. కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, గ్రానైట్స్ స్లాబ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణతోపాటు వద్దె రాంబాబు, తెడ్డు రమేశ్, కొమ్ము భాస్కరరావు, సూరంశెట్టి నర్సింహారావు, గుండోజు రామారావు తదితరులు ఎంపీని సన్మానించారు.

ఉద్యమకారుల డిమాండ్లను మేనిఫెస్టోలో చేర్చాలి

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన తాము బంగారు తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ బాటలో నడుస్తున్నామని, తమ డిమాండ్లను పార్టీ మేనిఫెస్టోలో చేర్చాలని ఉద్యమకారులు కోరారు. ఈ మేరకు ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు శనివారం వారు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఉద్యమకారులకు నామినేటెడ్, పార్టీ పదవుల్లో అవకాశం కల్పించడమే కాక జైలు జీవితం గడిపిన వారికి పింఛన్, ఉద్యమకారులకు 500 గజాల ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పగడాల నరేందర్, గుండ్లపల్లి శేషగిరిరావు, రడం సురేశ్‌గౌడ్, నందిగామ రాజ్‌కుమార్, లింగనబోయిన సతీశ్, దరిపల్లి వీరబాబు, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

ఎమ్మెల్సీ తాతా మధు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు

చర్లరూరల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఎమ్మెల్సీ, ఆ పార్టీ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాతా మధు అన్నారు. శనివారం చర్ల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సోయం రాజారావు ఇంటి వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు పనికిమాలిన విమర్శలు చేస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి తెల్లం వెంకట్రావును గెలిపించాలన్నారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ద్వారా చర్ల, దుమ్ముగూడెం మండలాల గొలుసు కట్టు చెరువులను లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నింపే ప్రయత్నం చేసి, జీవిత కాలం పంటలు పండించుకునేలా డిజైన్ చేసింది సీఎం కేసీఆరేనన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసే బాధ్యత తనదేనని, ఇప్పటికే భద్రాచలం, వెంకటాపురంలో సెంట్రల్ లైటింగ్ పూర్తి కావొచ్చిందని తెలిపారు. చర్లలో డిగ్రీ కళాశాల, ఫైర్ స్టేషన్ల ఏర్పాటుతో పాటు చర్ల ప్రభుత్వ వైద్యశాలలో వారం రోజుల్లోగా వైద్యులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమన్నారు. సమావేశంలో ఎంపీపీ కోదండ రామయ్య, పోలిన లంకరాజు, కొటేరు శ్రీనివాసరెడ్డి, తాండ్ర వెంకటరమణ, దొడ్డి తాతారావు, ఎస్డీ అజీజ్, దొడ్డి సూరిబాబు, అనిల్, వినోద్, సుజాత, కృష్ణవేణి పాల్గొన్నారు.

అర్హులకే పథకాలు ఇవ్వాలి..

- రఘునాథపాలెంలో అఖిలపక్షం ఆధ్వర్యాన ధర్నా
- ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉద్రిక్తత



నాయకులు, ప్రజలను అడ్డుకుంటున్న పోలీసులు



ధర్నాలో పాల్గొన్న నాయకులు, మండల ప్రజలు

రఘునాథపాలెం: అధికార పార్టీ నాయకులకే గృహలక్ష్మి, దళితబంధు, బీసీ రుణాలు కేటాయిస్తుండటంతో అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతోందంటూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యాన శనివారం రఘునాథపాలెం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, ప్రజలతో తొలుత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్, నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, మువ్వా విజయబాబుతో పాటు వివిధ పార్టీల నాయకులు యర్రా శ్రీకాంత్, ఎస్.నవీన్‌రెడ్డి, మంగతాయి మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో అర్హులకు కాకుండా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలకే దళితబంధు, గృహలక్ష్మి కేటాయించారని విమర్శించారు. ఇకనైనా అర్హులకు వర్తింపజేయకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా, ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. గేటు ఎక్కే క్రమాన తోపులాట జరిగి ఉద్రిక్తత నెలకొంది. చివరకు ఎంపీడీఓ అందుబాటులో లేకపోవడంతో సూపరింటెండెంట్ జానీమియా వచ్చి వినతిపత్రం స్వీకరించారు. వివిధ పార్టీల నాయకులు దొబ్బల సౌజన్య, కొంగర జ్యోతిర్మయి, బాలాజీ, కొంటెముక్కల నాగేశ్వరరావు, మారం కరుణాకర్‌రెడ్డి, తమ్మిన్ని నాగేశ్వరరావు, బాతుల రమణసుధాకర్, ధరావత్ రామ్మూర్తి, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగి విధులు ఆటంకం కలిగించినట్లు అందిన ఫిర్యాదుతో పలువురు నాయకులపై కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ శ్రీధర్ తెలిపారు.

జాబ్‌మేళాలో 20 మంది ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా ఉపాధి కల్పనశాఖ ఆధ్వర్యాన నగరంలోని టేకులపల్లి మోడల్ కెరీర్ సెంటర్‌లో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఉద్యోగాలకు నిర్వహించిన మేళాకు 58మంది మహిళలు హాజరు కాగా 20మందిని ఎంపిక చేశారు. వీరికి త్వరలో నియామక పత్రాలు అందుతాయని జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు

పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు



సుధాకర్‌ను ఆశీర్వదిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి తల్లి స్వరాజ్యమ్మ

కల్లూరురూరల్/పెనుబల్లి: బీఆర్ఎస్ పాలనలో అన్ని విధాలుగా నష్టపోయిన పేదల జీవితాలు బాగుపడాలంటే తాము అధికారంలోకి రావాలని కాంగ్రెస్ నాయకులు కొండూరి సుధాకర్, మువ్వా విజయబాబు అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ పాదయాత్ర శనివారం కల్లూరు మండలం నారాయణపురం, కొర్లగూడెం, పేరువంచ, ముగ్గు వెంకటాపురం, పెనుబల్లి మండలం ముత్తగూడెం గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అలాగే, నారాయణపురంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి తల్లి స్వరాజ్యమ్మ నాయకులను ఆశీర్వదించారు. ఆయా గ్రామాల్లో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీ పథకాలతో బీఆర్ఎస్ నేతలకు వణుకు పుడుతోందని చెప్పారు. తెలంగాణలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతుండగా, అన్ని వర్గాల ప్రజలను కేసీఆర్ మోసం చేశాడని ఆరోపించారు. దీంతో ప్రజలు ఆయన మాటలు నమ్మే పరిస్థితి లేకపోగా కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. యాత్రలో నాయకులు కీసర శ్రీనివాసరెడ్డి, యాసా వెంకటేశ్వరరావు, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కీసర మధుసూదన్‌రెడ్డి, సురేశ్, కిరణ్, కోటేశ్వరరావు, జనార్దన్, మల్లెల రాజా, జొన్నలగడ్డ శ్రీను, నర్సింహారావు, గూడూరు మాధవరెడ్డి, చిట్లూరి సత్యనారాయణరెడ్డి, వంగా దామోదర్, పిల్లి నవజీవన్, కాటేపల్లి కిరణ్‌కుమార్, తుమ్మలపల్లి లక్ష్మణ్‌రావు, అవులూరి రామకృష్ణారెడ్డి, రామిశెట్టి మనోహర్‌నాయుడు, గద్దె శ్రీనివాసరావు, పసుమర్తి ఉమామహేశ్వరరావు, సదానందరావు, కమలాకర్‌రావు, మల్లెల రాజా, యంగల సురేశ్, యలమంచి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దెదించడమే ఏకైక లక్ష్యం

ఖమ్మంవన్‌టౌన్: కేంద్రంలో బీజేపీని గద్దె దించడమే కాంగ్రెస్ లక్ష్యమని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై బీజేపీ నేతలు సోషల్ మీడియా ద్వారా చేస్తున్న దాడిని నిరసిస్తూ ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద శనివారం ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీకి పెరుగుతున్న జనాదరణను చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. నాయకులు నాగండ్ల దీపక్‌చౌదరి, యడ్లపల్లి సంతోష్, మాలోత్ రాందాస్‌నాయక్, పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, భారతీచంద్రం, మొక్కా శేఖర్‌గౌడ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో డీఐఈఓ తనిఖీ

ముదిగొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈఓ రవిబాబు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్, తరగతి గదులు, గ్రంథాలయాన్ని పరిశీలించాక అధ్యాపకులతో సమావేశమై పలు సూచనలు చేశారు. విద్యార్థుల హాజరుశాతం పెంచడమే కాక ఒక్కో అధ్యాపకుడు 20 మంది విద్యార్థుల బాధ్యత స్వీకరించి మెరుగైన మార్కులు సాధించేలా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలి



మిరప చేనులో పరిశీలిస్తున్న డీఏఓ

రఘునాథపాలెం: జిల్లాలో పలు ప్రాంతాల్లో మిరపకు తెగుళ్లు సోకుతున్నందున సస్యరక్షణ చర్యలపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల సూచించారు. మండలంలోని ఈర్లపుడి, పంగిడి, మూలగూడెం, హర్యాతండా గ్రామాల్లో శనివారం ఆమె పత్తి, మిర్చి, వరి పంటలను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సోకుతున్న తెగుళ్లు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ ఇంటూరి భాస్కర్‌రావు, ఏఈఓలు పాల్గొన్నారు.

అనుమతి లేని ప్లాట్ల రిజిస్ట్రేషన్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి సస్పెండ్

కూసుమంచి: కూసుమంచిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి ఒకరు ఇటీవల అనుమతి లేని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది. దీంతో సదరు ఉద్యోగిని నాలుగు రోజుల కిందట సస్పెండ్ చేయగా విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఇటీవల జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి డాక్యుమెంట్లను ఆయన పరిశీలించారు. ఉద్యోగి సస్పెన్షన్ నేపథ్యాన జిల్లా రిజిస్ట్రార్ తనిఖీకి వచ్చినట్లు తెలిసింది. అయితే, సాధారణ తనిఖీల్లో భాగంగానే జిల్లా రిజిస్ట్రార్ వచ్చారని సబ్ రిజిస్ట్రార్ రామనర్సయ్య తెలిపారు.

పోడు భూముల్లో పంటలు ధ్వంసం



వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని గుడిపాడులో సాగు చేసుకుంటున్న పంటలను అటవీశాఖ అధికారులు అర్ధరాత్రి వేళ ధ్వంసం చేశారని గిరిజనులు ఆరోపించారు. ఈ మేరకు ప్రజాపంథా ఆధ్వర్యాన శనివారం సత్తుపల్లిలో ప్రదర్శన నిర్వహించి తహసీల్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం ప్రజాపంథా నాయకుడు అమర్లపూడి శరత్ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా తామరచెరువు శివారు వంద ఎకరాల్లో పోడు భూమిని నాయకపోడు గిరిజనులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఇందులో 75 ఎకరాలకు పట్టాలు ఇవ్వగా, మిగిలిన భూమికి ఇవ్వలేదని ఆరోపించారు. ఈ నేపథ్యాన గతంలో ఇక్కడ పనిచేసిన రేంజర్ వెంకటేశ్వర్లు తీరుతో నిత్యం గొడవలు జరగగా, ఇప్పుడు సాగు చేసిన పంటలను ఫారెస్ట్ అధికారి మంగారావు ఆధ్వర్యాన ధ్వంసం చేశారని ఆరోపించారు. ఇకనైనా నష్టపోయిన గిరిజనులకు పరిహారం చెల్లించడమే కాక భూమికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుర్గ, పార్వతి, వీరస్వామి, ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, రమణ, రజిని, రవి తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం

రఘునాథపాలెం: మండలంలోని జింకలతండా గుట్ట నుంచి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న ఎనిమిది టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు రఘునాథపాలెం ఎస్ఐ కొండల్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొద్ది నెలలుగా ఇక్కడి క్వారీ నుంచి నేషనల్ హైవే పనులకు మట్టి తరలిస్తున్నారు. అయితే, తనిఖీ సందర్భంగా టిప్పర్లకు అనుమతి లేదని తేలడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం మైనింగ్ అధికారులకు సమాచారం ఇవ్వగా, అనుమతి తీసుకొచ్చిన నాలుగు టిప్పర్లను విడుదల చేసినట్లు ఆయన వివరించారు.

ఏడు కిలోల గంజాయి స్వాధీనం

మహిళపై కేసు, రిమాండ్‌కు తరలింపు



నిందితురాలు, గంజాయితో ఎక్సైజ్ పోలీసులు

నేలకొండపల్లి: కూసుమంచి మండల కేంద్రంలో శనివారం చేపట్టిన తనిఖీల్లో ఏడు కిలోల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వివరాలను ఎక్సైజ్ సీఐ కుమ్మరి పోశెట్టి నేలకొండపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో వెల్లడించారు. కూసుమంచి మండలంలోని వివిధ గ్రామాల్లో తనిఖీలు చేపట్టి నేలకొండపల్లికి వస్తుండగా కూసుమంచిలో అనుమానాస్పదంగా కనిపించిన మహిళను ప్రశ్నించగా పారిపోయేందుకు యత్నించింది. దీంతో ఆమెను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరికి చెందిన రీనా మండల్‌గా గుర్తించడంతో పాటు రూ.లక్ష విలువైన ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయిని రవాణా చేస్తున్నట్లు గుర్తించి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐలు రాధాకృష్ణ, సందీప్‌రావు, అచ్చారావు, సిబ్బంది శ్రీనివాసరావు, హరీశ్, సునీత, శ్రీలక్ష్మి, సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

జిల్లా వార్తలు

పర్యాటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- కొత్తగూడెం ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు
- కిన్నెరసానిలో అద్దాల మేడ ప్రారంభం



కిన్నెరసానిలో అద్దాలమేడను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వనమా, పక్కన డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్ తదితరులు

పాల్వంచరూరల్: రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. పాల్వంచ మండలం కిన్నెరసానిలో రూ.10.77 కోట్ల వ్యయంతో టూరిజం శాఖ ఆధ్వర్యాన తొమ్మిది కాటేజీలు, అద్దాలమేడ నిర్మించగా శనివారం అద్దాలమేడను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోనే కిన్నెరసానికి ప్రత్యేకత ఉందని, ఇక్కడ ఊటీ మాదిరి వాతావరణం ఉండటంతో పర్యాటకులు అత్యధికంగా వస్తున్నారని తెలిపారు. కాగా, అద్దాల మేడ వరకు వెళ్లే మార్గంలో కొంతదూరమే సీసీ రోడ్డు నిర్మాణానికి అనుమతించగా, మిగిలిన 850మీటర్ల మేర రోడ్డుకు వైల్డ్‌లైఫ్ శాఖ అనుమతించలేదు. దీంతో ప్రారంభానికి వచ్చిన ఎమ్మెల్యేకు సమస్యను టూరిజం శాఖ డీఈ రామకృష్ణ వివరించారు. ఈమేరకు ఎమ్మెల్యే ఆరా తీయగా వైల్డ్‌లైఫ్ చట్టం ప్రకారం రోడ్డు నిర్మాణానికి ఉన్నత స్థాయి నుంచే అనుమతి రావాలని అటవీ అధికారులు స్పష్టం చేశారు.

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత

వన్యప్రాణులు, వృక్ష సంపదను సంరక్షించడం అందరూ బాధ్యతగా భావించాలని ఎమ్మెల్యే వనమా సూచించారు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా కిన్నెరసాని డీర్ పార్కు వద్ద వైల్డ్‌లైఫ్ శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆ తర్వాత డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్ మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో స్వేచ్ఛగా సంచరించే వన్యప్రాణులను వేటాడటం నేరమనే విషయమై అందరూ అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కాగా, అద్దాల మేడ, రెస్టారెంట్, కాటేజీల్లో స్థానిక నిరుద్యోగులకే ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే వనమాకు పలువురు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమాల్లో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ కట్టా దామోదర్‌రెడ్డి, టూరిజం డీఈ రామకృష్ణ, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, కొత్తగూడెం మార్కెట్ చైర్మన్ భూక్యా రాంబాబుతో పాటు మూర్తి, వెంకట నాగప్రసాద్, మార్గం గురవయ్య, బొర్ర వీరకుమారి, పసల గోపి, కొంగర అప్పారావు, శోభారాణి, రాజు గౌడ్, మల్లెల శ్రీరామ్మూర్తి, పూసల విశ్వనాథం, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, అంబేడ్కర్, చైతన్య, సాధు రాజ్‌గౌడ్, పాల్గొన్నారు.

గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లండి..

కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి



మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ ఇటీవల ప్రకటించిన ఆరు గ్యారంటీలను 'గడపగడపకూ కాంగ్రెస్' పేరిట పినపాక నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలకు వివరించాలని పార్టీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం పినపాక నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రతీ గడపకు వెళ్లి బీఆర్‌ఎస్ హామీలను విస్మరించిన తీరును వివరించడమే కాక కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలయ్యే పథకాలను వివరించాలని చెప్పారు. పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రతీ కార్యకర్తకు మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

బాలికలు ఉత్తమ ఫలితాలు సాధించాలి



బాలికలతో మాట్లాడుతున్న జీసీడీఓ భూలక్ష్మి

ఎర్రుపాలెం: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ బాలికలు శ్రద్ధగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని జీసీడీఓ భూలక్ష్మి సూచించారు. ఎర్రుపాలెంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బోధన, వసతి ఏర్పాట్లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడాక సూపరింటెండెంట్ కె.సరిత, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు మెరుగైన బోధన చేస్తూ తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే, భవన మరమ్మతులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- చివరిరోజు నాలుగు సంఘాల నామినేషన్
- సింగరేణి ఎన్నికలపై కొనసాగుతున్న సందిగ్ధత

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పర్వం శనివారం ముగిసింది. పది సంఘాల బాధ్యులు శుక్రవారం నామినేషన్లు దాఖలు చేయగా, చివరిరోజు తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్), గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ), సింగరేణి గని కార్మిక సంఘం, ప్రజాతెలంగాణ సింగరేణి కార్మిక సంఘం(టీఎస్‌టీయూసీ) నేతలు నామినేషన్ పత్రాలను ఆర్‌ఎల్‌సీకి అందజేశారు. కాగా, ఇప్పట్లో ఎన్నికలు వద్దని కోరిన సంఘాల నేతలు సైతం నామినేషన్లు దాఖలు చేయడం చర్చనీయాంశమైంది. అయితే, హైకోర్టులో వాదనలు కొనసాగుతున్నందున ఒకవేళ ఎన్నికల నిర్వహించాలని తీర్పు వస్తే, తాము అర్హత కోల్పోతామనే ఆలోచనతో నామినేషన్లు వేసినట్లు తెలుస్తోంది. కాగా, ఈనెల 9వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఉండగా, ఆతర్వాత మిగిలిన వారి పత్రాలు పరిశీలించి 10వ తేదీన గుర్తులు కేటాయిస్తామని అధికారులు తెలిపారు. మరోపక్క గత నెల 30వ తేదీనే ఓటర్ల జాబితాను అందించాల్సి ఉన్నా యాజమాన్యం తాత్సారం చేస్తుండడానికి వెనుక కారణాలు తెలియరావడంలేదు.

నామినేషన్లు, ఎదురుచూపులు

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు 2017లో జరగగా ఆతర్వాత 2021లో నిర్వహించాల్సి ఉంది. కానీ వాయిదా వేస్తుండగా, ఇప్పుడు కాస్తకదలిక వచ్చింది. అయితే, డీవైసీఎల్సీ కార్యాలయం నుంచి షెడ్యూల్ వెల్లడైన ఓటర్ల జాబితాను మాత్రం యాజమాన్యం సమర్పించలేదు. ఇదిలా ఉండగానే నామినేషన్ల పర్వం ముగియడం.. ఇంకోపక్క కోర్టులో వాదనలు జరుగుతుండగా తీర్పు కోసం అటు కార్మిక సంఘాలు, ఇటు యాజమాన్యం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. హైకోర్టులోని ద్విసభ్యబెంచ్ ఈనెల 11న తీర్పు వెలువరించే అవకాశముందని సమాచారం.



ఆర్‌ఎల్‌సీకి నామినేషన్లు అందజేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

ఎన్నికల వాయిదా కోసం తీర్మానం?

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలను ఎలాగైనా వాయిదా వేయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనగా ఉందనే ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ఈనెల 6వ తేదీన అన్ని కార్మిక సంఘాల నాయకులను హైదరాబాద్‌లో చర్చలకు యాజమాన్యం ఆహ్వానించింది. ఇప్పట్లో సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు వద్దని వారితో తీర్మానం చేయించినట్లు తెలిసింది. ఏదిఏమైనా గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగుతాయా, లేదా అన్నది 11వ తేదీన తేలే అవకాశముంది.

ఇండియా కూటమిగానే పనిచేస్తాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోనూ ఇండియా కూటమిగానే పనిచేస్తూ కలిసొచ్చే పార్టీలను కలుపుకెళ్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. ఖమ్మంలోని సుందరయ్యభవనంలో శనివారం జరిగిన పాలేరు నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. బీజేపీతో పాటు దాని కూటమి పార్టీలను దేశవ్యాప్తంగా ఓడించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఇదే లక్ష్యంతో వచ్చే ఎన్నికల్లో పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ అవలంబిస్తున్న ప్రజాప్రతిరేక విధానాలపై అందరూ అసంతృప్తిగా ఉన్న నేపథ్యాన దేశంలో కచ్చితంగా ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు బి.వెంకట్, బండి రమేష్, భూక్యా వీరభద్రం, వై.విక్రమ్, ఎర్రా శ్రీనివాసరావు, నండ్ర ప్రసాద్, షేక్ బషీరుద్దీన్, సుదర్శన్‌రెడ్డి, కొమ్ము శ్రీను, గుడవర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంమయూరిసెంటర్: మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

వైరారూరల్: రిటైర్డ్ ప్రొఫెసర్ గాలి అరుణ్‌కుమార్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందిన అరుణ్‌కుమార్ మృతదేహాన్ని స్వగ్రామమైన వైరా మండలం పూసలపాడుకు తీసుకొచ్చి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహంపై తమ్మినేని ఎర్రజెండా కప్పి నివాళులర్పించాక మాట్లాడారు. నాయకులు పోతినేని సుదర్శన్ రావు, నున్నా నాగేశ్వరరావు, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, పొన్నం వెంకటేశ్వరరావు, ఎం.సుబ్బారావు, తోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి

ఖమ్మంమామిళ్లగూడెం: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఏపీ సంఘటనా ప్రధాన కార్యదర్శి మధూకర్‌జీ సూచించారు. ఖమ్మం, నల్లగొండ, భువనగిరి పార్లమెంటరీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌గా నియమితులైన ఆయన శనివారం ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తనతోపాటు ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌గా సునీల్ దియోదర్‌ను నియమించారని తెలిపారు. ఈ నెల 11 నుంచి 15 వరకు జిల్లాలో పర్యటించి పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డితోపాటు నాయకులు గెంటెల విద్యాసాగర్, రుద్రప్రదీప్, శ్యాంరాథోడ్, మందా సరస్వతి, అల్లిక అంజయ్య, పుల్లయ్య, భద్రం, లక్ష్మీనారాయణగుప్తా, శ్రీనివాస్, చావా కిరణ్, రవిరాథోడ్, పమ్మి అనిత, గజల శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, ఫణికుమారి తదితరులు పాల్గొన్నారు.



మధూకర్‌జీని సన్మానిస్తున్న నాయకులు

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీని నిమించనున్నట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. బోటనీ, కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, తెలుగు, జువాలజీ బోధించేందుకు ఆసక్తి ఉండి, సంబంధిత సబ్జెక్ట్‌లో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలైతే 50 శాతం మార్కులు కలిగిన వారు ఈనెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 11న ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు.